# జన్మభూమి బూటకం

## ప్రభుత్వమాడుతున్న మరో నాటకం

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రంలో పదిరోజులపాటు సాగిన 'జన్మభూమి – మా వూరు' మూడవ విడత నాటకం ముగిసింది. ఎన్ని విడతలు ఈ ప్రహసనం సాగినా, రేషన్‌కార్డులు–ఇళ్ళస్థలాలు, ఇళ్ళు – పెన్షన్ల గురించి లక్షల దరఖాస్తులు వెల్లువెత్తటమే ఈ కార్యక్రమ బూటకత్వాన్ని వెల్లడిచేస్తోంది. ఈ విడత పోగుబడిన 18 లక్షల దరఖాస్తులతో కలిపి 'జన్మభూమి'లో మొత్తం పెండింగ్ దరఖాస్తుల సంఖ్య 53 లక్షలకు చేరుకుంది. ప్రతి విడత 'జన్మభూమి' కార్యక్రమానికి ముందుగా, ప్రజలకు పెద్దఎత్తున ఏదో చేయబోతున్నట్లు విస్తృత ప్రచారం చేసుకోవటం మినహా, ఆచరణలో ప్రజలకు ఒరిగే మేలు శూన్యంగా వుంది. ప్రస్తుతమున్న రేషన్‌కార్డుల స్థానంలో మరో తరహా కార్డులను (ఎందుకో?) పంపిణీ చేయబూనుకోవటం, అర్హులైనవారి నుండి ఇళ్ళు, ఇళ్ళస్థలాల కోసం అభ్యర్థన పత్రాలను స్వీకరించటం, ప్రతినెలా అందచేసే వృద్ధాప్య, వికలాంగ, వితంతు పెన్షన్లను ఈ కార్యక్రమంలో అందజేయడం వంటి మొక్కుబడి చర్యలతో ఇది దండగమారి కార్యక్రమంగా మారిపోయింది. వార్డులు లేదా గ్రామాల స్థాయిలో ప్రజలను ఒకచోటికి సమీకరించి, అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు హాజరై, వారి గ్రామ సమస్యలు, జీవన సమస్యలను విని, వాటిని పరిష్కరించగలిగే సత్తా, ధైర్యము వీరికి వుందా అంటే లేదనేదే ఖచ్చితమైన జవాబు. ఈ మాత్రపు తంతు నిర్వహణలో కూడా వ్యతిరేకత ఏమాత్రం వ్యక్తం కానీయకుండా చంద్రబాబు ప్రభుత్వం 'జాగ్రత్తలు' తీసుకొంది. జన్మభూమి కార్యక్రమంలో నిరసన తెలుపుతున్న వారిని నిర్బంధంలోకి తీసుకోవటం గతకాలపుచర్య కాగా, నిరసన తెలుపుతారని అనుమానించిన ప్రత్యర్థి పార్టీల నాయకులను ముందుగానే అదుపులోకి తీసుకోవటం, చంద్రబాబు మార్కు నేటి పాలనా విధానంగా వుంది. అధినాయకుని గురించి కీర్తిగానాలతో, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల ఘనతను వల్లె వేయటంతో, ప్రస్తుతం రాష్ట్రం క్లిష్టపరిస్థితుల్లోనున్నప్పటికీ ఎన్నికలవాగ్దానాల అమలుకు తమ ప్రభుత్వం చేస్తున్న నిర్విరామ శ్రమగురించి ఛోటా నాయకుల మొదలు మంత్రుల వరకు చేసిన రొడ్డకొట్టుడు ఉపన్యాసాలతో జనం రోసిపోయారు.

రాష్ట్రాన్ని కరువు పరిస్థితులు వెంటాడుతున్నాయి. గత వ్యవసాయ సీజన్‌లో తీవ్ర వర్షాభావం కారణంగా లక్షల ఎకరాలలో పంటలు వేయకపోవటంతోపాటు, రానున్న సీజన్‌లో కూడా ఇదే పరిస్థితి కొనసాగనుంది. కరువు మండలాలుగా ప్రకటించటానికి మీనమేషాలు లెక్కబెట్టిన ప్రభుత్వం, పలు కరువు పీడిత మండలాలను ఆ జాబితా నుండి మినహాయించింది. కరువు సహాయక చర్యలు చేపట్టటంలో ఘోర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. వ్యవసాయరంగ సంక్షోభానికి తోడు కరువు సమస్యతో రైతాంగం జీవితాలు అతలాకుతల మౌతున్నాయి. పెద్దసంఖ్యలో రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 'కౌలురైతుల' నిర్వచనాన్ని మార్చి, రైతాంగ ఆత్మహత్యల సంఖ్యను తగ్గించి చూపుతున్న విధంగానే, 'కరువు' నిర్వచనాన్ని మార్చివేసి, కరువు తీవ్రతను తగ్గించి చూపే ప్రయత్నం చేస్తున్నారు. సాగునీరేగాక పశువులకు మేత, తాగునీరు కరువవటంతో వాటిని కబేళాలకు తరలించే దుస్థితి దాపురించింది. ఇక వ్యవసాయ కూలీలు, భూమి కోల్పోయిన చిన్నరైతులు, కౌలుదార్లు –వలసకూలీలుగా గ్రామాలనుండి పట్టణాలకు, గల్ఫ్ ప్రాంతాలకు పొట్టచేతబట్టుకొని తరలి పోతున్నారు. గ్రామీణ చిన్నవ్యాపారులు, చేతివృత్తిదారుల పరిస్థితులూ ఘోరంగా మారాయి.

దేశంలోని సగానికి పైగా గ్రామాలు – రక్షిత మంచినీరు కాదుకదా, కనీస తాగునీటి సదుపాయం లేక కొట్టుమిట్టాడుతున్నాయి. సుదూర ప్రాంతాలకు మహిళలు నడిచి వెళ్ళి, పాతాళం నుండి మంచినీటిని తోడి తెచ్చుకుంటున్న దృశ్యాలు కోకొల్లలు. కలుషిత తాగునీటి సమస్యనెదుర్కొంటున్న గ్రామాలతోపాటు, పెక్కు శారీరక వైకల్యాలకు కారణమౌతున్న ఫ్లోరైడ్ బాధిత గ్రామలు మరెన్నో! స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పబడుతున్న దాదాపు ఈ ఏడు దశాబ్దాల కాలంలో సుజల పథకాల ప్రారంభాలకు లక్షల కోట్ల రూ॥ నిధుల కేటాయింపులు తప్ప గ్రామాలలో రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించని పాలకులు, 'జన్మభూమి'తో ఏదో ఒరగబెడతారనుకోవటం భ్రమే అవుతుంది. కాగా, పోగా బడా కంపెనీల వేల కోట్ల రూపాయల తాగునీటి వ్యాపారానికి తగిన భూమికను ఏర్పరచటమే జరుగుతోంది.

ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి తన బాధ్యత నుండి తప్పుకొని, ప్రజాధనాన్ని బడా సంపన్నులకు అప్పనంగా దోచిపెడ్తూ, గ్రామాలను వారి దయాదాక్షిణ్యాలకు వదలివేస్తోంది. సినీతారలు, క్రికెటర్లు, సెలబ్రిటీలు, బడా రాజకీయ నాయకులు, వివిధ కార్పొరేటు యాజమాన్యాలు తలా ఒక్కో గ్రామాన్ని 'అభివృద్ధి' చేయటానికి ఎంచుకోవటాన్నే ఘనంగా కీర్తిస్తోంది. వీరు చేసే అభివృద్ధి ఏపాటిదో ప్రక్కనుంచితే, మిగిలిన గ్రామాలన్నింటినీ ఎవరో ఒక ఆదుకునే దాత కోసం ఎదురుచూడమంటున్నది.

ప్రజల దుర్భర జీవన పరిస్థితులను చక్కబరచటానికి చర్యలు తీసుకోకపోగా, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం రాజధాని ఏర్పాటు పేరిట కృష్ణా, గుంటూరు జిల్లాలలోని 29 గ్రామాల పరిధిలో 33 వేల ఎకరాల భూములను రైతుల నుండి సమీకరించటం

పేరున గుంజివేసుకుంది. జిల్లాకు లక్ష ఎకరాలపైగా సేకరించి భూ బ్యాంకును ఏర్పరచి, అడిగిందే తడవుగా బడా, బహుళజాతి పరిశ్రమల యజమానులకు కట్టబెట్టేందుకు తెగ ఆరాటపడు తోంది. ఒక రేషన్‌కార్డు కోసం, సెంటు ఇంటి స్థలంకోసం

ఎన్నో విడతలుగా జన్మభూముల తరబడి దరఖాస్తులు పెట్టిన జనం పడిగాపులుపడుతున్నా ఫలితం దక్కక పోతున్న పరిస్థితి ఒకవైపు వుండగా, మరోవైపున బడా, బహుళజాతి కంపెనీలు దరఖాస్తు చేసిన 21 రోజుల లోపు ప్రభుత్వం వైపు నుండి భూమితోసహా వారికి కావలసిన అన్ని అనుమతులనూ ఏక గవాక్ష పద్ధతిలో ఏక్‌దం ఇచ్చేస్తామని, ఒకవేళ ఆ గడువు లోపల ఇవ్వలేకపోతే, అనుమతులన్నీ వచ్చినట్లే భావించాలని ప్రభుత్వం వారికి భరోసానిస్తోంది.

మరోవైపున ప్రజలను తీవ్రంగా వేధిస్తున్న ఉపాధి సమస్యను తెలుగుదేశం ప్రభుత్వం గాలికొది లేసింది. 'జాబు రావాలంటే బాబు రావాల'ని ఎన్నికల ముందు ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చాక కొత్తగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోగా, వివిధ శాఖలలో ఖాళీగా వున్న లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేయకపోగా, దశాబ్దాల తరబడి వెట్టిచాకిరీ చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సర్వీసును క్రమబద్ధం చేయకపోగా, ఇప్పటికే వున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కూడా కుదించే చర్యలు చేపడుతోంది. కోస్టల్ కారిడార్, పెట్రో కారిడార్, మరియు వివిధ సెజ్‌లు, ప్రాజెక్టుల పేరిట గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బడా, బహుళజాతి కార్పొరేటుసంస్థలకు లక్షల ఎకరాల భూములను కట్ట బెట్టారు. అంతకు మరెన్నో రెట్లు ఉపాధి సౌకర్యాలను రాబడతామన్నారు. ఈ అంశంపై కాగ్ తన పరిశీలనలో నిర్దేశిత ప్రతిపాదనకనుగుణంగా పరిశ్రమలేవీ స్థాపించ బడలేదని, వీటిలో ఉపాధి పొందినవారికంటే, ఈ భూములను వ్యవసాయానికి దూరం చేయటం ద్వారా ఉపాధి హరించబడిన వారి సంఖ్యే ఎంతో అధికమని తేల్చి చెప్పింది. ప్రతిపక్షంలో వుండగా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గొంతుకలిపిన చంద్రబాబు, తాను అధికారంలోకి వచ్చినాక, అంతకు రెండాకులు ఎక్కువగానే భూముల నుండి రైతులను దూరంచేసే చర్యలు చేపడుతూ ప్రజల ఉపాధి సమస్యను మరింత తీవ్రం చేస్తున్నాడు. 'జన్మభూమి'లో ఉపాధి సమస్యల ఊసెత్తడానికి కూడా ప్రభుత్వం సిద్ధంకాలేదు.

ఇంకోవైపున నిత్యజీవితావసర వస్తువుల ధరలు మండిపోతూ, పండగపూట పరమాన్నం కాదుగదా కనీసం కడుపునిండా అన్నంతినే పరిస్థితులు సామాన్యునికి మృగ్యమౌతున్నాయి. బియ్యం, కూరగాయలు, పాలు, వంటనూనెలు, పప్పుధాన్యాలు, ఇతర చిల్లర సరుకుల ధరలు; వంటచెరకు, కిరోసిన్, వంటగ్యాస్ ధరలు, విద్యుత్తుఛార్జీలు, ప్రయాణఛార్జీల భారాలు పెరిగిపోయి, విద్య, వైద్య ఖర్చులు తోడై సామాన్యులేకాక, మధ్యతరగతి ప్రజానీకం సైతం కుదేలైపోతున్నారు. పెరుగుతున్న ధరల భారాలను ఏవిధంగానూ నియంత్రించకపోగా, 'చంద్రన్న కానుక' పేరిట పండగ రోజుల్లో సైతం వేలిగుర్తులు, కంటి ముద్రల పరీక్షలో పాసయ్యేందుకు రేషన్ దుకాణాలలో బారులుతీర్చి ప్రజలను నిలబెట్టిన ఘనత రాష్ట్రపాలకులకే దక్కుతుంది. ప్రభుత్వ విధానాలలో లోపాలు వెల్లడి కాకుండా, జన్మభూమి వేదికలపై క్రిందిస్థాయి అధికారులను ప్రజల ముందు దోషులుగా నిలబెట్టి, ప్రజల సమస్యలు పరిష్కారంగాక పోవటానికి వారే కారణమన్నట్లుగా నిలదీయటం ఆగ్రహించటం, వారిపై కేకలు వేయటం ఇటు ప్రభుత్వానికీ; ప్రజల మెప్పు పొందేందుకు ఇవన్నీ పాలకుల తంతాలు అనుకోవటం అటు అధికారులకూ పరిపాటి అయిపోయింది. తీరా ప్రజల సమస్యలు మాత్రం, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగానే వుంటున్నాయన్నది వాస్తవం. తమ నిత్యజీవితాచరణలో ప్రభుత్వ నాటకాలను గుర్తిస్తున్న ప్రజానీకం సంఘటితమై వ్యవసాయరంగ సంక్షోభం, కరువు సహాయచర్యలు, భూమి – ఉపాధి సమస్య, అధికధరలు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వాల మెడలు వంచే నిలకడైన పోరాటాలకు పూనిక వహించాలి.

oooooo